కిష్టయ్యా పంతులు

శ్రీ మా. గోఖలే

ఆ పల్లెటూళ్లో ఎప్పటల్లే తెల్లవారింది. పల్లె ప్రజలు తమ నిత్యజీవితానికి భిన్నం లేకుండా ఎవరి పనులకు వారు తయారవుతున్నారు.

బాదంచెట్టు పందిరి వేసి, సొరతీగ పాకిన ఆ పూరిగుడిసె చిన్నపిల్లల బడిపంతులు కిష్టయ్యాపంతులిది. గుడిసె చుట్టూ ఖాళీప్రదేశానికి చిల్లకంప దడి లాగ రక్షణవుంది. ఇతర ముళ్ళెల్లాగానే చిల్లకంప ముళ్ళుకూడా పరిసరాల్లో సంచరించే ప్రాణులకు గుచ్చుకుంటే పెట్టవలసినంత బాధ పెట్టి తీరుతుంది. అయితే యీ విశ్వాసం ఆరోజు ఉదయం కిష్టయ్యా పంతులుకు పూర్తిగా నశించింది.

పొరిగింటివారి పాడిబర్రె కిందటి మధ్యరాత్రి సమయంలో ఆ చిల్లకంప దడిని ఛేదించుకుని కిష్టయ్యా పంతులు గుడిసెమీదకు యేపుగా యెగబాకుతున్న సొరతీగను కొంకటి వేళ్ళతో సహా పెల్లగించింది.

తెల్లవారంగానే కిష్టయ్యాపంతులుతో పాటు యీ దృశ్యాన్ని చూసిన కిష్టయ్యాపంతులుభార్య కోటమ్మ, ముందు ఎంతకోపంతో వణికిపోయినా తొందరపడి యెవరిమీదా నోరెత్తలేదు. 'ఇంతపని చేసింది పొరిగింటి వెంకయ్య బర్రె' అని కిష్టయ్యా పంతులు, కోటమ్మ సులభంగా గ్రహించారు.

"ఎంతపని జరిగింది! మన పిల్లలు లేచి సొరతీగను చూసుకుని యెంతగా బాధపడతారో! ఎవరికేం పాపం బద్దలయిందో - నా కెందుకొచ్చింది, ఆ మంచో చెడ్డో మీరే విచారించుకోండి. అవతల నాకు గంపెడంత పనుంది." అంటూ తీగె తెగినట్టు సొరపాదు దగ్గిరే కుప్పన కూలిపోయిన కిష్టయ్యాపంతుల్ని పాదుదగ్గిరే వొదిలేసి లోలోపల శపించుకుంటూ యింటిపనికి వెళ్ళిపోయింది కోటమ్మ.

తెల్లవారంగానే ఆనాటికి సరిపోయే విస్తళ్ళు కుట్టటానికి గుడిసెమీద పందిరివేసిన బాదంచెట్టు ఆకులు కోసే అలవాటున్న కిష్టయ్యా పంతులు ఏపైన ఆ సొరపాదు యెదుగుజూసి మురిసిపొయ్యేవాడు. బాదమాకులు కోస్తూ సొరపాదు ఏ క్షణాన పిందె వేసినా వేస్తుందనే భ్రమతో సొరతీగ ఆకాకుసందున అతి సూక్ష్మంగా రోజూ పరిశీలించేవాడు కిష్టయ్యా పంతులు. సొరతీగె పిందెలు ఆకులచాటున దక్కున్నట్టు కిష్టయ్యా పంతులు కలలు కన్నాడు.

తెగిపోయిన సొరతీగ ప్రాణానికి బాధతో విలపిస్తున్న కిష్టయ్యా పంతులు హృదయం బాధనివారణకు పరిహారం కోరింది. వెంటనే ఎవరో తన్నినట్టు లేచిన కిష్టయ్యా పంతులు పొరిగింటివారింటికి అడ్డంగా ఉన్న చిల్లకంపదడి దగ్గరకు వెళ్ళి "వెంకయ్యబావా" అని కేక వేశాడు ఆవేశంతో.

కిష్టయ్యాపంతులు వేసిన కేక విన్న పొరిగింటి వెంకయ్య కొంచెం కట్టువస్త్రం అదీ సవరించుకుని చిల్లకంపదడి దగ్గరకు చేరేలోపల కిష్టయ్యా పంతుల్ని అంతరాత్మ ఒక్క క్షణం నిలవేసింది.

'ఎంతైనా పశువయిన బర్రెగొడ్డు మన స్తత్వానికి మానవ జీవితంలో పరువు ప్రతిష్ఠలున్న నీ వ్యక్తిత్వం లొంగిపోతుందా?' అంది అంతరాత్మ. 'నీపొరుగింటి వెంకయ్యబావ నీ సొరతీగపై ప్రయోగించటానికా యింత కష్టకాలంలో ఆ బర్రెను పోషిస్తున్నది? అనివార్యంగా పలుపుతెగిన ఆ పశుచర్యకు యెవరూ బాధ్యులు కారు.—నీ వ్యక్తిత్వాన్ని గౌరవించు-గౌరవించు—'అని వూరుకుంది అంతరాత్మ.

"ఏం కిష్టయ్యా పంతులూ? యియాళ పొద్దున్నే పిలుస్తుండావు, ఏం కత?" అన్నాడు చిల్లకంపదడి దగ్గరకు చేరుకున్న వెంకయ్య.

"చూశావా వెంకయ్యబావా! రాత్రి నీ బర్రెగొడ్డు ఎంతపని చేసిందో?" అన్నాడు రుద్ధకంఠంతో కిష్టయ్యాపంతులు ఆవేశాన్ని నివారించుకుంటూ.

"ఈ బర్రె పడిసావ! యివి మనం సెప్పేనమాట యింటయ్యాంటయ్యా పంతులూ! రేత్రి పాలుపితకు తెంపనే తెంపింది గావాల్సు. యిట్ట తెల్లారి లేసి సూస్తునుగందా వామిలో జనపకట్టె చెత్త చెత్తగా

తినేసి నెమరేస్తా కూకుంటది! అయితే మీ దొడ్డోకి కూడ సేరిందన్న మాట!" అన్నాడు వెంకయ్య.

"మాకు బావా ఆ సొరతీగ ప్రాణాన్ని నిలువునా ఎట్టాతీసిందో!" అన్నాడు కిష్టయ్యపంతులు సొరతీగవేపు దిగులుగా వేలు పెట్టి చూపిస్తూ.

"అగెగెగె యెంతపని జరిగిందీ! నిచ్చేపమంటి సొరతీగను కాస్తా పొట్టన పెట్టుకుందే! యిగూళ్ళ దీనికి మూడింది!" అన్నాడు వెంకయ్య దవడ కొరుక్కుంటూ.

"పోనీలే బావా, చూడి బఱ్ఱెదాన్నేం కొట్టకు. అది పసువు. మనలాగ వాటికి విచక్షణ తెలియదు. ఏదో తొందరపడి పిలిచానుగాని అసలీ విషయం నీకు చెప్పక నేపోదును. దైవికంగా జరిగింది; ఎవరేం చేస్తారు పోనీ" అన్నాడు కిష్టయ్యపంతులు వెంకయ్య ఆవేశానికి భయపడుతూ.

"అసలయినా తినేసేదో ఆ జనపకట్టే తిని కూచోక యీ పనేంది? యిదిగో పంతులూ నువ్వు మంచోడివి గాబట్టి సరిపోయిందిగాని లేకపోతే యిగూళ్ళ తెల్లారంగానే రగడ తిగులుకునేదే! ఇంకా నయం లేచివేళ మంచిదయింది! ఇదిగో పంతులూ మా వాములదొడ్డో సొరపాదేశాను, కాయ కాయటం మొదలు పెట్టేసంటేయిగ నీ యిష్టం— యెన్ని కావాలంటే అన్ని తెచ్చుకో - తెలిసిందా?"

వెంకయ్యతో జగడం పెట్టుకోనందుకు మనసులో ధన్యవాదాలర్పించాడు కిష్టయ్యపంతులు.

మెల్లిగా నెల్లి చిక్కుపడిన సొరతీగ మొదలు సరిజేసి పెల్లగించబడిన వేళ్లను ఆశతో తిరిగి పాదులో పూడ్చి పాదుకు నీళ్లుపోశాడు కిష్టయ్యపంతులు.

"ఇహ యివ్వాళంతా ఆ సొరతీగ మొదట్లోనే కూచుంటారా ఏమిటి ఖర్మ! వెళ్ళి ఆ పిచ్చెమ్మ దగ్గరో, పులమ్మదగ్గరో, కాసిని మజ్జిగచుక్క పోయించుకు రండి" అని కిష్టయ్యపంతులు, వెంకయ్యల సంభాషణ వంటపొయ్యి అలుక్కుంటూ విన్న కోటమ్మ ఒక్కక్షణం ఆగి, కేక వేసి చెప్పింది.

"బాదమాకులు కోసినాక అట్లాగే వెళతాలే" అన్నాడు కిష్టయ్యపంతులు ఆకులు కొయ్యటానికి వెదురుగడ వెతుక్కుంటూ.

"ఇహ సరే! మనం తీరా తీరిగ్గా తరలివెళ్ళేసరికి ఆ దొరికే ఒక్కచుక్కా ఎవరో తన్నుకుపోతారు. ముందావిషయం చూడండి మళ్ళీ బడికి వేళయిందంటారు - ఇటొచ్చి సత్తెప్పాల పట్టుకుపొండి చెయ్యి తీరుబడి లేదు" అని చెప్పింది కోటమ్మ.

మజ్జిగ సత్తెప్పాల తీసుకుని, పొడుగ్గా కప్పుకున్న పై ఉత్తరీయంకింద కనపడకుండా పదిలంగా పెట్టుకుంటూ ఆ సందులోంచి వెళుతున్న కిష్టయ్యపంతులుకు చుట్ట కాల్చుకుంటూ వాములదొడ్డికి బఱ్ఱెగొడ్డును తోలుకుపోతున్న బసవయ్య యెదురైనాడు.

బసవయ్య బఱ్ఱెగొడ్డును చూసీ చూడంగానే మళ్ళీ సొరతీగ కళ్లకు కట్టినట్టై కొంచెంసేపు గుండె దడదడా కొట్టుకున్నా కన్నులు సగం మూసుకుని సాధువులాగా వస్తున్న బసవయ్య బఱ్ఱెనూ, పక్కనే ఆ బఱ్ఱెగొడ్డును ఆప్యాయంగా అదలించుకుంటూ వస్తున్న బసవయ్యనూ చూసీ మనసు మెత్తపడిపోయిన కిష్టయ్యపంతులు వెంటనే బసవయ్యను పలకరించాడు.

"ఏం బసవయ్యన్నా బాగున్నావా? యీ మధ్య కనిపించి చాలా రోజులయిందే? పెద్దవాడివై పోతున్నా పెత్తనం వదల్టంలేదు నీకు" అన్నాడు కిష్టయ్యపంతులు క్షణంకిందటి ఘటన హరించుకున్నట్టు.

"ఇప్పట్నించి పెద్దతనం వచ్చిందని చెప్పుకుంటే పట్టపగలే మా కళ్లకు గంతలు కట్టరూ మీ బామ్మలంతా చేరీ—ఇహ్హి—ఇహ్హి—" అంటూ చుట్ట పొగతో పాటు పెద్దతనంగా నవ్వాడు బసవయ్య.

"నీ కొడుకు నిన్ను వొంగదీసి గుద్దుతున్నా యింకా నీకు పులుపు తగ్గలేదే బసవయ్యన్నా. ఇహిహిహిహీ!" అంటూ అమాయకంగా బసవయ్యతో వంత గలిపినవ్వాడు కిష్టయ్యపంతులు.

"మరి అట్టాటి చదువు చెపితివి వాడికి. ఇగ వాడు మామాట వింటాడంటయ్యా పంతులూ? యేదో ఆ చేత్తోనే వాడికో ఆడుగూతుర్ని తగిలిస్తివా పెళ్ళికి నీకింతపప్పుబువ్వ పెడ్తా." అన్నాడు బసవయ్య కిష్టయ్యపంతుల్ని ఆప్యాయంగా చూస్తూ.

"ఒక్క పప్పుబువ్వతోనే పోనిస్తానా నిన్ను బసవయ్యన్నా! తథాస్తు! శీఘ్రమేవ కల్యాణప్రాప్తిరస్తు! అయితే మీ బఱ్ఱెగొడ్డు ఎప్పుడు యీస్తుంది బసవయ్యన్నా?- అన్నట్టు చూశావా బసవయ్యన్నా, రాత్రి వెంకయ్యబావ బఱ్ఱెగొడ్డు వొచ్చి మా సొరతీగను యెట్లా ధ్వంసం చేసిపోయిందో! నాలుగు సొరపిందెలు పడితే యీ బీదపంతులుకు యెంత ఉపయోగమో చూడు బసవయ్యన్నా ?" అన్నాడు కిష్టయ్యపంతులు మరుక్షణంలో కుంగిపోతూ. "అరెరెరె!

తెల్లవారంగానే ఎంత పనయిందీ! ఇవన్నీ దైవికంగా జరిగేవి కిష్టయ్య పంతులూ! యీ విషయాల్లో యెవర్నీ మనం ఏమీ అనలేం" అన్నాడు బసవయ్య.

"కాదా మరి బసవయ్యన్నా! ముందుకోపంతో ఒళ్లు దహించుకుపోయింది కాని చివరికి వెంకయ్య బావతో పల్లెత్తుమాట అన్నానా? అది నోరులేని పశువు! ఇంతకీ నా అదృష్టం ఆ విధంగా వుంది. ఇదిగో బసవయ్యన్నా పొద్దున్నే నిన్నడగటం ధర్మం కాదు గాని నోరుచేసుకు అడుగుతున్నా; ఒక రూపాయి బదులుంటే సర్దుతావా, జీతం అందగానే తీర్చుకుంటా." అన్నాడు కిష్టయ్య పంతులు.

"రూపాయే! రూపాయి కాదు గదా యింట్లో ఒక్క ఎర్రని ఏగాని లేదంటే నమ్మ పంతులూ! నిన్న మా బావమర్దికి అరిజంటుగా వుత్తరం రాయించాలని ముక్కాణీకోసం వూరంతా తిరిగా. ఇదిగో పంతులూ ఆ లెక్కకొస్తే మా రైతులుకంటే మీ పంతుళ్లే యెయ్యి రెట్లునయం! నీకు నెల తిరిగేసరికి పాతిక రూపాయలంటూ కంటికి కనిపిస్తాయ్. మరి మా యవారం పంటలొచ్చిన మూణ్ణాల ముచ్చటేగా!" అన్నాడు బసవయ్య.

"ఆ, ఇహ నన్నుజూసి నువ్వూ, నిన్నుజూసి నేనూ ముచ్చటపడాల్సిందే! నిజం చెబుతున్నాను బసవయ్యన్నా, నాలుగు నెలలనుంచి జీతాలులేవు-మరి పైన ఆ భగవంతుడే వున్నాడు! పాతికరూపాయల నా కుటుంబస్థితికి యెంతకావాలి బసవయ్యన్నా? పోనీ యీసారి మీ బర్రెగొడ్డుయీస్తే యీ పంతులుకు యింత మజ్జిగ చుక్కన్నా పోస్తావా? యిహ యీసారి నిన్ను ఒదలేదు లేదు." అన్నాడు కిష్టయ్యపంతులు.

"ఒకచుక్క గాకపోతే రెండుచుక్కలు పోయించుకుపో. నిన్ననే దెవరు-అగరెరె బర్రెగొడ్డేది? చూశావంటయ్యా పంతులూ ఓ శెంప నీ సారతీగ తెగిందంటుంటివి, దీన్ని కొస్తా వొదిలేసి కూకుంటివి—ఎవరింటి మీదన్నా పడిలేదు గదా—వస్తా కిష్టయ్యపంతులు-" అంటూ గబగబ వెళ్లిపోయాడు బసవయ్య.

నిజానికి ఉదయంపూట ప్రాథమిక బడిపంతులైన కిష్టయ్యపంతులుకు యీ విధంగా సందులు గొందుల్లో కనపడ్డవారితోనల్లా తన కష్టసుఖాలు చెప్పుకుంటానికి తన వుద్యోగం ఒప్పుకోదు. ఉదయం ఏడున్నర గంటలకే బడిలో గీగామంటుంటే పిల్లలకు పాఠాలు ప్రారంభించవలసినవాడు సందుగొందుల్లో కాలయాపనజేస్తే వుద్యోగానికి ముప్పురావటం అట్లావుంచి క్రమశిక్షణతో నడుస్తున్న బడిలో చదువుకోవలసిన పిల్లకాయలు గోతులుతవ్వి గోలికాయ లాడుకుంటూ జుట్టు జుట్టు పట్టుకుని ఒళ్లంతా పీక్కుని రక్తం కాలవలు కట్టిస్తారు.

అయితే యిరవయ్యేళ్ళపాటుగా తనకి దక్కే జీతండబ్బుల్ని పవిత్రంగా ఎంచుకుంటున్న కిష్టయ్య పంతులు తన వుద్యోగం విషయంలో నిర్లక్ష్యంగా వుంటాడనేందుకు వీలేలేదు.

అందుకే బసవయ్యతో పదినిమిషాలు ఖర్చయిందనే గాభరాతో మజ్జిగ సత్తెప్పాలను గుర్తుకుంచుకుంటూ గబగబ సందుమలుపు దాటేసరికి కాళ్ళకు కిర్రుచెప్పులు, చంకలో చేతికర్ర, రెండు చేతుల్లో పొగాకు పాయ చుట్టుకుంటూ వొస్తున్న రత్తయ్య మీద పడ్డంత పనయింది కిష్టయ్యపంతులుకు.

"ఏంపంతులూ యవారం మాజోరుమీ నుండదే, యేంది కత?" అన్నాడు రత్తయ్య చుట్టనచుట్ట ఒక పంటితో కొరుకుతూ, ఓకంటితో కిష్టయ్య పంతుల్ని చూస్తూ.

"నువ్వా రత్తయ్య తమ్ముడూ! యింకా నయం. పుణ్యానికి నీమీద పడితినికాదు! యెన్ని పనులున్నా తెల్లవారేసరికి మాకీబడి తొందర తప్పనేతప్పదు గదా! బాగున్నావా రత్తయ్యా! మీకు పొలంపన్లతోనూ మాకు బడితోను సరిపోతుండె. పొద్దుం చేసుకుంటానికి కాస్త మంచిపొగాకు చూచిపెడతానంటివి, యేదీ మళ్ళీ మనం జతపడ్డేలేదుగా!" అన్నాడు కిష్టయ్య పంతులు ఒక్కక్షణం ఆగిపోదామనుకుంటూ.

"పుగాకుసంగతి ఆనక సూద్దాంగానీ, నువ్వు బళ్ళో పిల్లకాయలకు పాటాలు సరీగా చెబుతుండావంటయ్యా పంతులూ?" అన్నాడు రత్తయ్య.

"అదేమిటి రత్తయ్యా యివాళ వింతగా మాట్లాడుతున్నావు! బళ్ళో పిల్లలకు మేము పాఠాలు సరీగా చెప్పకపోతే రోజూ బడికెందుకు వెళ్లటం, దండక్కు గాకపోతే! ఏమైనా ఆ దండెగమారి పన్లు యింతవరకు మా వల్ల నవటంలేదు రత్తయ్యా." అన్నాడుకిష్టయ్య పంతులు. రత్తయ్యధోరణి సందేహిస్తూ.

"అయిసయమేందో మీ పంతుళ్ళకు తెలవాల్పిందే గాని, అయితే మొన్న మా పిల్లకాయ లచ్చినా్నరా

యణ్ని కొట్టావంటదేనికయ్యా పంతులో? మరదంతా పాటాలు చెప్పటమేనంటా?" అన్నాడు రత్తయ్య.

"ఎవరు—లక్ష్మీనారాయణ్ణా! జ్ఞాపకం రావటంలేదే! అథవా రెండు వేసేవుంటా ననుకుందాం, దానికి నువ్వింత పనిగా బెట్టుకుని నిలబెట్టి అడగాలా రత్తయ్య తమ్ముడూ? పిల్లలు బళ్లో కొంటె పనులుచేసీ, పాఠాలు సరీగా చదవక, యెన్నో అవస్థలు పెడుతుంటే వాళ్ళను మా విధిగా భావించి దారిన పెట్టేందుకు రెండు దెబ్బలు వేసినా తప్పుకింద తీసుకోకూడదు రత్తయ్యా. మీ పిల్లవాడేమిటి అందరు పిల్లలూ మా కొకటే. వాళ్ళు చక్కగా చదువుకుని పెద్దవాళ్లై ప్రయోజకులైతే మా శ్రమఫలితం దక్కుతుంది. ఆమాటకొస్తే మీ తమ్ముడు సుబ్బయ్య నాదగ్గర చదువుకు నేప్పుడు యెన్ని దెబ్బలు తినలేదూ?" అన్నాడు కిష్టయ్యపంతులు.

"కొడితేమటుకు బ్రగొడ్డును కొట్టె నట్టు అంతలావు దెబ్బంటయ్యా కొట్టటం?" అన్నాడు రత్తయ్య.

"శివశివ! మరీ అంత అపవాదు నెత్తిన వెయ్యబోకు రత్తయ్య తమ్ముడూ! బళ్ళో వున్నంతసేపూ నీ పిల్లవాడు నా పిల్లవాడే. ఆ మాటకొస్తే నా పిల్లవాణ్ణే మెత్తగా దెబ్బవేసి వూరుకుంటానా తప్పు జేస్తే? యిరవైయేళ్ళనుంచి యీ ఉద్యోగం అఘోరిస్తున్నాను, పిల్లల మనస్తత్వం గురించి నాకివ్వాళ కొత్తా రత్తయ్యా?" అన్నాడు కిష్టయ్యపంతులు.

"కాదని నే ననునుగాని యెందుకైనా మంచిది కాత్తె కనిపెట్టి పోవయ్యోవ్ పంతులూ, ఆనక యవారం చెడుద్ది. యెళ్లొస్తా— కాత్తె బద్రం—" అంటూ చుట్ట ముట్టించుకుని కిర్రుచెప్పులు విరగదొక్కుకుంటూ యెటుగానో వెళ్ళిపొయాడు రత్తయ్య.

'శివ శివ! తెల్లవారే యెంతమాటన్నాడు యీ రత్తయ్య!' అనుకుని విచారిస్తూ అప్పుడే పిల్లలు బడికి పోవటం మాసి తత్తరపడుతూ మజ్జిగ సత్తెప్పాలతో పుల్లమ్మ యింటివేపుకు గబగబ యింకో పదడుగులు వేసేసరికి బడిపిల్లలు సీతారాముడు, రత్తయ్య కొడుకు లక్ష్మీనారాయణ, యెదురైనారు కిష్టయ్య పంతులికి.

"మేం బడికిపోతున్నాం పంతులు గారూ!" అన్నాడు ఆరోజు బడికి పెందరాడే బయలుదేరిన సీతారాముడు వస్త్రం వేళ్ళాడేసుకుంటూ.

"ఇయాల మీరు బడికొస్తారండీ పంతులారూ?" అన్నాడు లక్ష్మీనారాయణ కిష్టయ్య పంతుల్ని కొంచెం ఓరగా చూస్తూ.

"రాత్రి పాఠాలు బాగా చదివావా లక్ష్మీనారాయణా?" అనడిగాడు కిష్టయ్యపంతులు లక్ష్మీనారాయణ్ణి ఒక వింతవస్తువుని చూస్తున్నట్టు చూస్తూ.

"సదివానండీ పంతులారూ" అన్నాడు లక్ష్మీనారాయణ తడుముకోకుండా.

"నిన్న - మొన్న నేను కొట్టానా—లక్ష్మీనారాయణా?" అనడిగాడు కిష్టయ్యపంతులు తడుముకుంటూ.

"మొన్నెప్పుడండి పంతులుగారూ? గాపకం రావటం లేదండీ!" అన్నాడు లక్ష్మీనారాయణ.

"దెబ్బ బాగా తగిలిందా లక్ష్మీనారాయణా?" అన్నాడు కిష్టయ్య పంతులు.

"అబ్బే యేం లేదండీ పంతులారూ!"అన్నాడు లక్ష్మీనారాయణ అమాయికంగా.

"ఏం కిష్టయ్య పంతులుగారూ యింకా యిక్కడే వున్నారు. యివాళ బడికి శెలవు పెట్టేరా?" అనడిగాడు బడికి పోతున్న తోటి పంతులు రామయ్య.

"ఆఁ - ఆఁ - లేదే - ఏదీ - వస్తున్నా ఇప్పుడే వస్తున్నా నీ వెనక నే—" అంటూ బడికి తయారైన రామయ్యను నిర్ఘాంతపోయి చూస్తూ మజ్జిగ సత్తెప్పాల కనపడకుండా వుత్తరీయం చాటున భద్రంగా దాచుకుంటూ దాదాపు పుల్లమ్మింటికి పరుగెత్తాడు కిష్టయ్య పంతులు.

"పుల్లమ్మక్కయ్యా-ఓపుల్లమ్మక్కయ్యా, ఎక్కడున్నా? ఒక్క చుక్క మజ్జిగ పొయ్యవూ బడికి వేళైపోయిందీ?" అంటూ పుల్లమ్మింటికి చేరిన కిష్టయ్య పంతులు హడావిడిగా పిలిచాడు పుల్లమ్మను.

"ఎవరూ? మీరండీ కిష్టయ్యపంతులు గారూ, యెవరా అనుకున్నా! అయ్యొయ్యో నే నేంచేతును పంతులుగారూ! తెల్లారంగా నే ఆ రామయ్యపంతులొచ్చి ఆ ఒక్కచుక్క కాస్తా పోయించుకుపొయ్యాడే!" అంది పుల్లమ్మ యిల్లలుకుతున్న అలుగ్గుడ్డతో వచ్చి అట్టాగే నోరు తెరుచుకు నుంచుంటూ.

"ఎంతపనిచేశావ్ పుల్లమ్మతల్లీ! నిన్న అంతగా మరీమరీ చెప్పిపోతిని మరింతేనా . నువ్వుచేసింది!" అన్నాడు ఒక్కసారిగా నిలువునా స్తంభించిపోయిన కిష్టయ్యపంతులు.

"అమ్మోర్యో యేం సెయమంటారు పంతులు గారూ, గెపితికివుండదీ! ఏం వుంటే ఏం సారదకం! ఆ రామయ్యపంతులొచ్చి పోస్తేగాని కుదరదంటూ సల్లకవ్వం కాడే కూకునె! దబ్బునెల్లి ఆ పిచ్చెమ్మ పిన్నినన్నా అడగండి. కూసిని పొయ్యనన్నా పోసుద్ధి"అంది పుల్లమ్మ.

"పోస్తే అదృషవంతుణ్ణే! కాని నాకీ అదృష్టం రోజూ వుండవలసిందేగా పుల్లమ్మక్కా! ఎవరికైనా యేదో ఒకరోజైతే పరవాలేదు; రోజూవచ్చి సొంత సొమ్ములేపోయించుకు పోతుంటే నిజానికి సోసేవారికి యెంతకష్టంగా వుంటుంది పుల్లమ్మక్కా! ఏదో యీ బీదపంతులంటే కనికరంతో విసుగు లేకుండా నువ్వే కాసినో చుక్కలు పోస్తుంటావు; పోనీ అదే పదివేలు—ఇవాళ తెల్లవారే ఎంతన్యాయం జరిగిందో చూశావా పుల్లమ్మక్కా! ఆ వెంకయ్యబావ బర్రెగొడ్డు కాస్తా చక్కని మా సారతీగను ఎంత సర్వనాశనం చేసిందో చూశావా పుల్లమ్మక్కా! ఇంక వారమో పదిరోజులకో పిందె వెయ్యటానికి సిద్ధంగా వుంది! అవిధంగావుంది నా అదృషం పుల్లమ్మక్కా!" అన్నాడు కిష్టయ్య పంతులు సారతీగను స్మరిస్తూ.

"ఎంతన్యాయం జరిగింది పంతులు గారూ! దాని మొదులారా, ఆ బర్రెగొడ్డు పడక పడక మీ యింటిమీనే పడాలా?" అంది పుల్లమ్మ సానుభూతితో.

"ఆ తారతమ్యం పశువులకు తెలుస్తుందా, నాకు జరగవలిసిందేదో జరిగి పోయిందిగాని!— అరెరెరె యివ్వాళ యింక నేను బడికేంపోతాను!— వొస్తా పుల్లమ్మక్కా - రేపన్నా కాస్త చల్లచుక్క వుంచు నీకు పుణ్యంవుంటుంది - అన్నట్టు వెంకయ్యబావేడీ కనిపించడూ?" అన్నాడు కిష్టయ్యపంతులు వెళ్లిపోయేవాడు కాస్తా యేదో పీకినట్టు నిలబడిపోతూ.

"తెల్లగా తెల్లారకతలికే పొలం యెళ్లాడుగా! అయినా ఆయనకి కూసేపు యింట్లో కూకుంటే యేందో పురుగు తొలుస్తానే వుంటది!"అంది పుల్లమ్మ వెంటనే మొగుడు వెంకటాద్రిని తలుచుకుంటూ.

"చివరికి వెంకటాద్రి బావను నమ్ముకొస్తేయింట్లో లేకుండానే పోయినాడే! - సరేవస్తా - ఆఁ, ఏంలేదు పులమ్మక్కా - ఒకరూపాయుంటే బదులిస్తాడేమో అడుగుదామనుకున్నా - ఇంట్లో చాలా యిబ్బందిగా వుంది - ఏదీ మనిషే కనపడకుండా పోయెనుగా! - ఏదో అడగలేక అడుగుతున్నా యేమీ అనుకోకు పుల్లమ్మక్కా! బావ నీదగ్గర డబ్బేమీ వుంచడుగా?" అన్నాడు కిష్టయ్యపంతులు తలెత్తకుండా.

"అమ్మోర్యో పంతులుగారూ మీ బావ సంగతి యింకా మీకు తెలవకనే పాయెనే-" అంటున్నది పుల్లమ్మ దిగులుగా—

"అబ్బే నాకు తెలియకగాదుగాని ఏదో అడిగాలే పోనీ పుల్లమ్మక్కా - ఏం అనుకోబోకు - వెంకటాద్రి బావొస్తే చెప్పు వచ్చిపోయినానని. వస్తా పుల్లమ్మక్కా - అరెరెరె! బడిగంట కొడుతున్నారే-" అంటూ రైలుబండికోసం తహతహపడిపోయిన వాడిమాదిరి కంగారుపడుతూ ఖాళీ మజ్జిగ సత్తెప్పాలతో గబగబా ఆ సందులు గొందుల్లో పడి మాయమైనాడు కిష్టయ్యపంతులు.

తన ఆలస్యానికి హెడ్మాష్టరు శివతాండవం చేస్తుంటాడు—తన తరగతిపిల్లలు సామాన్యులు కాదు—తను లేని రెండు నిమిషాల్లోనైనాసరే తరగతిలో వాళ్లు గోతులు తవ్వి గోలీకాయలాడతారు - వాళ్లు ఒకళ్లనొకళ్లు పీక్కుని రక్తం కార్చుకుంటూ శోకాలు పెడుతుండే హెడ్మాష్టరు దృష్టిన పడుతుంది తను వెళ్లేసరికి హెడ్మాష్టరు జేబుగడియారం నిమిషాలు లెక్కపెట్టుకుంటూ తన తరగతి గుమ్మందగ్గర నుంచుని తనకోసం చురచుర చూస్తుంటాడు - తన ప్రవర్తనగురించి ఖచ్చితంగా నిగ్గదీసి అడుగుతాడు - తనకు పగువుగా వుద్యోగకాలం ముగించుకునే యోగ్యతలేదు - తనను వుద్యోగంలోంచి గెంటివేస్తే ట్రైనింగు ప్యాసైన ముత్యాల్లాంటి పడుచువాళ్లు వందలు, వేలకొద్దీ నిమిషాలమీద వొచ్చి వాలుతారు- అసలే తనది పాతకాలపు ట్రైనింగు అనుకుంటూ యమపాశంతో వుచ్చు బిగిసినవాడి మాదిరి చల్లగా బడిలో తన తరగతిలో ప్రవేశించాడు కిష్టయ్య పంతులు.

తరగతిలోని పిల్లలంతా నిశ్శబ్దంగానూ, భయభక్తులతోనూ కిష్టయ్యపంతులువైపు చూశారు.

ఆ పిలల మొహాలు యెంత అందంగావున్నయ్! ఆపిల్లలు తన విద్యార్థులు! వాళ్లకు తనవిద్య, తన శ్రమ, శక్తి, తనజీవితం అంకితమైం దనుకున్నాడు కిష్టయ్య పంతులు ఆనాటి పాఠాలు ప్రారంభిస్తూ.